

# రాబడి

# మదుపుతోనే గెలుపు









## ద్రవ్యసమీక్షపైనే..

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాలకు దూరంగా ట్రేడ్ అవుతున్నాయి. గతకొద్ది రోజులుగా మదుపరులు పెట్టుబడులకు సంశయిస్తున్నారు. ఫలితంగా సూచీలు నష్టాలకే పరిమితం కావాల్సి వస్తున్నది. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 270.07 పాయింట్లు లేదా 0.33 శాతం పడిపోయి 81,451.01 దగ్గర నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 102.45 పాయింట్లు లేదా 0.41 శాతం కోల్పోయి 24,750.70 వద్ద స్థిరపడింది. ఈ వారం కూడా సూచీలు పడుతూలేస్తూ పయనించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను ఈ నెల 4-6 తేదీల్లో నిర్వహించనున్నది. దీంతో వడ్డీరేట్లపై ఆర్బీఐ నిర్ణయాల ఆధారంగా మార్కెట్లు ట్రేడ్ అయ్యే వీలున్నదని చెప్పవచ్చు. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా జరిగిన రెండు ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ అర శాతం తగ్గించిన విషయం తెలిసిందే. రాబోయే ద్రవ్యసమీక్షలోనూ మరో పావు శాతం తగ్గవచ్చన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకింగ్, ఆటో, రియల్టీ, ఇతరత్రా కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు ఆకర్షణీయం కానున్నాయి. సూచీలు తిరిగి లాభాలను సంతరించుకోవచ్చు. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, ముడి చమురు ధరలు దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అయితే అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,300 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,000 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,300-25,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**మార్కెట్ పల్స్**

*గమనిక..*

*స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*



**నేడు** మనం చేసే పొదుపు, పెట్టుబడులే రేపు మన భవిష్యత్తుకు రక్షణనిస్తాయి. దీర్ఘకాలంలో ఆర్థిక క్రమశిక్షణకు ఇవే సోపానాలు. ముఖ్యంగా మన ఆర్థిక లక్ష్యాల సాధనకు పెట్టుబడులే కీలకం. తెలివైన నిర్ణయాలతో చక్కని రాబడులను అందుకోవచ్చు. మరి ఇందుకున్న అవకాశాలు ఏమిటి? ఎలా ముందుకెళ్తే వాటిని సద్వినియోగం చేసుకోవచ్చు?

### డైరెక్ట్ ఈక్విటీ

స్టాక్స్‌లో పెట్టే పెట్టుబడులనే డైరెక్ట్ ఈక్విటీ అంటారు. ఏదైనా కంపెనీ షేర్లను మీరు కొన్నట్టైతే.. అందులో మీకు పాక్షికంగా యాజమాన్య హక్కులు వచ్చినట్టే. ఇక ఈ పెట్టుబడులకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వేదికలవుతాయి. డీమ్యాట్ ఖాతాల ద్వారా షేర్ల క్రయవిక్రయాలను చేయవచ్చు. అయితే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు అనేక అంశాలకు ప్రభావితమై ఉంటాయి. కాబట్టి ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ రిస్కులతో ముడిపడి ఉంటాయి. అందుకే మార్కెట్ పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.

### మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్ సంస్థల గురించి నేటి తరం ఇన్వెస్టర్లకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మన పెట్టుబడులను స్టాక్ మార్కెట్లతోపాటు డెట్, హైబ్రిడ్ ఫండ్స్ తదితర రకరకాల సాధనాల్లో మదుపు చేస్తాయి. దీర్ఘకాలిక మదుపునకు మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు లాభదాయకం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)తో ప్రారంభం బాగుంటుంది. అయితే ఇవి కూడా రిస్క్‌తో కూడుకున్నవే. సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదివి ముందుకెళ్లాలి.

### ఫిక్స్‌డ్ డిపాజిట్లు

బ్యాంకులు, ఇతర ఫైనాన్షియల్ సంస్థలు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)ను ఆఫర్ చేస్తాయి. ఇవి సురక్షిత పెట్టుబడులు అని చెప్పవచ్చు. రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల ఆధారంగా డిపాజిటర్లకు వడ్డీ అదాయం ఉంటుంది. పన్ను మినహాయింపులు లభిస్తాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్లకు అనువైనవి. వీటికి లాకిన్ పీరియడ్ ఉంటుంది.

### రికరింగ్ డిపాజిట్లు

రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ) కూడా మరో ఫిక్స్‌డ్ టెన్యూర్ ఇన్వెస్ట్‌మెంట్. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఈ పెట్టుబడులకు అవకాశం ఉంటుంది. నెలనెలా చిన్నచిన్న మొత్తాలతో మదుపునకు వీలుంటుంది. పెట్టుబడికి రక్షణ, గ్యారంటీడ్ ఇన్‌కమ్ వీటి సొంతం.

### పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

ఇదో దీర్ఘకాలిక పన్ను ఆదా పెట్టుబడి. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)కు లాకిన్ పీరియడ్ 15 ఏండ్లు. కేంద్ర ప్రభుత్వం హామీ ఉంటుంది. ప్రతీ మూడు నెలలకోసారి వడ్డీరేట్లను కేంద్రం నిర్ణయించి ప్రకటిస్తుంది.

### ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్).. వేతన జీవులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇందులో జమయ్యే నిధులకు అధిక వడ్డీరేటు లభిస్తుంది. కాబట్టి వీటిని ఉపసంహరించుకోకుండా కాపాడుకోవడం కూడా మంచి పెట్టుబడి కిందకే వస్తుంది.

### నేషనల్ పెన్షన్ సిస్టమ్

పీపీఎఫ్, ఈపీఎఫ్‌లతో పోల్చితే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో పెట్టుబడిదారులు అధిక రాబడులను పొందవచ్చు. పన్ను ప్రోత్సాహకాలుంటాయి. అయితే ఈ పథకాన్ని ఎంచుకొంటే రిటైర్మెంట్‌దాకా లాకిన్ పీరియడ్ ఉంటుంది. అయినప్పటికీ నిబంధనలకు లోబడి 40 శాతం వరకు నిధులను వెనక్కి తీసుకోవచ్చు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్ సబ్‌స్క్రిప్షన్ తప్పనిసరిగా ఉన్నది.

## కొంచెం కొత్తగా ఆలోచిద్దాం..

**రోజులు** మారిపోయాయి. ఒకప్పటితో పోల్చితే మదుపరులకు పెట్టుబడికున్న అవకాశాలూ పెరిగిపోయాయి. సంప్రదాయ పెట్టుబడుల స్థానంలో ఇప్పుడు హైటెక్ పెట్టుబడులు వస్తున్నాయి. నేటి తరం వీటిపై మరింతగా దృష్టి సారిస్తే గొప్ప ప్రయోజనాలనే అందుకోవచ్చు. మరి వాటిలో..

**ఏఐ ఆధారిత ఈటీఎఫ్‌లు**

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లో పెట్టుబడుల ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్, ఆటోమేషన్ తదితర నయా టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు అడుగులు వేయవచ్చు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భవిష్యత్తు అంతా వీటిదేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాబట్టి ఏఐ ఫోకస్డ్ ఈటీఎఫ్‌లను ఎంచుకోవడం ఉత్తమమే.

**క్రిప్టో సిప్స్**

బిట్‌కాయిన్ వంటి ప్రధాన క్రిప్టోకరెన్సీల్లో సిస్టమ్యాటిక్ మంత్లీ ఇన్వెస్ట్‌మెంట్స్ (సిప్).. యువతరానికి బాగా కలిసిరాగలవని మెజారిటీ నిపుణుల అంచనా. దీర్ఘకాలంలో సంపద సృష్టికీ ఇవి దోహదం చేయగలవు.

**గ్రీన్ బాండ్లు, డిజిటల్ గోల్డ్**

రెన్యువబుల్ ఎనర్జీ, సస్టెయినబుల్ ప్రాజెక్టుల్లో ఫండింగ్ చేసే గ్రీన్ బాండ్లనూ మదుపరులు తమ పెట్టుబడులకు ఎంచుకోవచ్చు. అలాగే యూపీఐ యాప్స్ ద్వారా సూక్ష్మ పెట్టుబడులనూ అనుసరించవచ్చు. పీర్-టు-పీర్ లెండింగ్ సాధనాలనూ పరిశీలించవచ్చు.



## జిల్లాలో ఆరుగురికి సేవా పతకాలు

వనపర్తి టౌన్, జూన్ 1 : రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌శాఖలో విశిష్టమైన సేవలు అందించిన పోలీస్ సిబ్బందికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోలీస్ పతకాలను వనపర్తి పోలీసులు అందుకోవడం అభినందనీయమని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మహోన్నతమైన పతకం అందుకున్న కొత్తకోట పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, మదనాపురం పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎండీ నసీరుద్దీన్, అమరచింత పోలీస్ స్టేషన్‌కు చెందిన బాలప్ప, సాయుధదళ కార్యాలయానికి చెందని సుధాకర్, రాంలాల్‌లు పతకాలు పొందడం అభినందనీయమన్నారు. అంకితభావంతో, నీతి నిజాయితీతో విధులు నిర్వహించాలని, ఈ పతకాలు రెట్టింపు ఉత్సహాంతో విదులు నిర్వహించడానికి తోడ్పడతాయని ఎస్పీ చెప్పారు.

## హాకీ టోర్నమెంట్‌కు క్రీడాకారుల ఎంపిక



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా హాకీ జట్టు

వనపర్తి టౌన్, జూన్ 1 : ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌కు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేయడం జరిగిందని హాకీ అసోసియేషన్ కార్యదర్శి బోలమోని కుమార్ తెలిపారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, క్యాంపు అనంతరం ఎంపికైన క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ ఎంపికలో 60మంది క్రీడాకారులు పాల్గొనగా హాకీ జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, అసోసియేషన్ నాయకులు నిరంజన్‌గౌడ్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

## సైకిల్ తొక్కడంతో సంపూర్ణ ఆరోగ్యం

మక్తల్, జూన్ 1 : మనిషి నిత్య జీవితంలో సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని నారాయణపేట ఇన్‌చార్జి డీవైఎస్‌వో వెంకటేశ్‌శెట్టి అన్నారు. జూన్ 3వ తేదీన ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని, నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ డే ర్యాలీ కార్యక్రమానికి ఇన్‌చార్జి డీవైఎస్‌వో వెంకటేశ్ శెట్టి, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సైకిల్ ర్యాలీ ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రతిఒక్కరూ సైకిల్ తొక్కడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు ధాన్సింగ్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు, పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, మీనా, వ్యాయామ ఉపాధ్యాయులు రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటేశ్‌శెట్టి

## ఆగని ఆక్రమణలు




- ఖాళీ స్థలాల్లో మట్టి, రాళ్లకుప్పలు వేసి ఆక్రమించుకుంటున్న వైనం
- రోడ్లను సైతం ఆక్రమిస్తున్న వ్యాపారులు
- కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, శిథిలావస్థ చేరుకున్న గృహాలు
- పట్టించుకోని అధికారులు

దోమలపెంట , జూన్ 1 : అమ్రాబాద్ మండలం దోమలపెంట గ్రామం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్నా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఇరిగేషన్ శాఖ అధీనంలో ఉన్న 890ఎకరాల స్థలంలో దోమలపెంట గ్రామం విస్తరించి ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో నీటిపారుదల శాఖ కార్మికులు ప్రాజెక్టు ఉద్యోగుల నివాసాల కోసం కృష్ణా నదికి ఎడమవైపున ఉన్న అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దోమలపెంట, ఈగలపెంటలో 890 ఎకరాల అటవీ భూమిని సేకరించి 150ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టారు. 1964-66 నుంచి 1973-75 మధ్య కాలంలో 20 ఏండ్ల కాల పరిమితితో ఇండ్లు నిర్మించారు. దోమలపెంటలో 499 గృహాలు ఉద్యోగులు, కార్మికులకు కేటాయించారు. 1992 వరకు నిర్వహణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగింది. గృహాలు శిథిలావస్థకు చేరకోవడంతో ఖాళీ చేయాలని కోరారు. ప్రమాదాలు సంభవించి ఇండ్లు కూలి పడి ఆస్తి, ప్రాణా నష్టం సంభవిస్తే నీటిపారుదల శాఖకు సంబంధం లేదంటూ అధికారులు అంగీకార పత్రాలు తీసుకున్నారు. ఇది ఇలా ఉండగా దోమలపెంట చెక్ పోస్ట్ నుంచి పాతాళగంగా ప్రధాన జాతీయ రహదారి రోడ్డు ఇరువైవులా ఉన్న స్థలాలు, ఇండ్లకు డిమాండ్ ఉంది. గ్రామంలో అధికారులు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రాజకీయ నాయకుల అండదండలతో దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగా గ్రామాల్లో ఉన్న పలు గృహాలు, స్థలాలు కబ్జాకు గురయ్యాయి. గ్రామంలో కొంత మంది అధికారులు అండదండలతో ఖాళీ స్థలాల్లో మట్టి కుప్పలు, రాళ్లకుప్పలు వేసి అక్రమించుకుంటున్నారు. మరి కొంత మంది సొసైటీ పేరిట కొంత భూమిని మాత్రమే ప్రభుత్వం ద్వారా రిజిస్ట్రేషన్ చేపించి ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసి వ్యాపారాలు చేస్తున్నారు. అదే విధంగా డైవర్షన్ రోడ్డు కోసం వేసిన దారిని కూడా ఆక్రమించి వ్యాపారాలు నడిపిస్తున్నారు. దోమలపెంట, ఈగలపెంట, పాతాళగంగా గ్రామాల్లో ఎన్నో లార్జింగ్‌లు, హోటళ్లు , బెల్ట్ షాపులు అక్రమంగా నిర్వహిస్తున్నారు. అధికారులు పట్టించుకోకుండా వారి వద్ద నుంచి మాముళ్లు తీసుకుంటున్నారని వినికిడి. నీటిపారుదల శాఖకు చెందిన శిథిలావస్థకు చేరుకున్న గృహాలను కొంత మంది రాజకీయ నాయకులు అధికారుల అండదండలతో శుభ్రం చేసి ఆక్రమ నిర్మాణాలు చేపట్టి వాటిని అమ్ముకొని లక్షల్లో లాభాలు గడిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నీటిపారుదల శాఖలో ఉద్యోగ విరమణ పొందిన కొందరు ఉద్యోగులు ఇండ్లకు మరమ్మతులు చేసుకొని ఇక్కడే ఉంటున్నారు. స్వగ్రామాలకు వెళ్లిన వారి గృహాలు శిథిలమయ్యాయి. వాటిని కొందరు ఆక్రమించుకొని విక్రయిస్తున్నారు. నీటిపారుదల శాఖ అధీనంలో ఉన్న భూములపై గ్రామ పంచాయతీకి అధికారం లేదని, దీంతో శ్రీశైలం ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న భూములను ఆక్రమించుకొని మట్టి కుప్పలు, రాళ్లు వేసి స్థలం మాది అని అనిపించుకుంటూ క్రయా విక్రయాలకు పాల్పడుతున్నారు. గృహాలు, స్థలాలను విక్రయిస్తూ గ్రామ పంచాయతీల్లో నమోదు చేయిస్తున్నారు. ప్రభుత్వ క్వార్టర్లకు తప్పుడు పత్రాలను సృష్టించుకొని నివాసాముంటూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఆక్రమ నిర్మాణలపై ఏ అధికారి కూడా స్పందించడం లేదు.

గతంలో కొంతమంది గ్రామంలో ప్రభుత్వ స్థలాలు, గృహ ఆక్రమణకు గురవుతున్నాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటు చేసి దోమలపెంటలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలు, గృహాలను గుర్తించేందుకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కమిటీ దోమలపెంటలో ఆక్రమణకు గురైన స్థలాలు, గృహాలను గుర్తించి కలెక్టర్‌కు పూర్తి నివేదికను అందజేసింది. ఈ నివేదికపై ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదు.




గ్రామంలోని అక్రమ కట్టడం

### అన్నీ నీటిపారుదల శాఖ భూములే

దోమలపెంట గ్రామంలో స్థలాలన్నీ నీటిపారుదల శాఖకు చెందినవే. గ్రామంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన స్థలాల్లో ఆక్రమ నిర్మాణలు చేపడితే శాఖపరమైన చర్యలు చేపడుతాం. దోమలపెంటలో ప్రభుత్వ క్వార్టర్స్ స్థలాలు , గృహాలు క్రయా విక్రయాలు చెల్లవు.

**- శ్రీనివాస్, డీఈ, నీటిపారుదల శాఖ**

## పార్కులను పట్టించుకోరా..?

- **నిరుపయోగంగా మారిన ఆట వస్తువులు**
- **పేరుకుపోయిన పారిశుధ్యం**
- **పార్కుల వంక చూడని ప్రజలు**

గద్వాలటౌన్, జూన్ 1 : పేరు గొప్ప ఊరు దిబ్బలా మారింది జిల్లా కేంద్రం పరిస్థితి. వార్డుకో పార్కును నిర్మించామని గొప్పలు చెప్పుకోవడం తప్పా పట్టింపు కరువైంది. పార్కుల నిర్వహణను పూర్తిగా విస్మరించారు. దీంతో పార్కులన్ని కూడ పారిశుధ్య నిలయాలుగా మారిపోయాయి. పార్కులో ఉన్న మొక్కలను, చెట్లను పట్టించుకునే వారు లేక పూర్తిగా ఎండిపోయాయి. అహ్లాదం కోసం వచ్చే ప్రజలు అసహించే స్థితికి పార్కులు చేరుకున్నాయి. మంచి వాతావరణం, స్వచ్ఛమైన గాలి కోసం వచ్చే ప్రజలు పార్కుల నుంచే వాసనను భరించలేక పోతున్నారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పుబట్టి ఎందుకు పనిరాకుండా పోతున్నాయి. వృద్దులు, పిల్లల కోసం ఏర్పాటు చేసిన పరికరాలు కనిపించకుండా పోయాయి. రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాగా పార్కులు మారిపోయాయి. ప్రజలు లేకపోవడంతో కళావిహీనంగా పార్కులు దర్శనమిస్తున్నాయి. పార్కుల నిర్వహణను అధికారులు, పాలకులు పట్టించుకోవడం మానేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా అసాంఘిక కార్యాకలాపాలకు అడాగా మారిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. కాగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలి అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



కళావిహీనంగా మారిన దౌదర్‌పల్లిలోని పార్కు